# కార్తీక పురాణము



# కార్తీక పురాణము 1వ అధ్యాయము

**కార్తీకమాసంలో మొదటి రోజు చేయవలసిన విధులు :**

**1వ రోజు శుద్ధ పాడ్యమి ప్రాతఃకాలమున స్నానం చేసి శివ లేక విష్ణు ఆలయానికి కాని వెళ్ళి స్వామి వారిని దర్శించుకొని కార్తీకవ్రత సంకల్పాన్ని చెప్పుకొని కోరికను కోరుకోవాలి. ఉల్లి, ఉసిరి, ఎంగిలి, చద్ది వస్తువులు తినకూడదు. సాయంత్రం దీపారాధన చేసి ఆకాశదీపాన్ని చూడాలి. బంగారం, నెయ్యి దానం చేయాలి.**

**కార్తీకమాస స్నాన సంకల్పవిధి :**

**ప్రార్థన :"నిర్విఘ్నం కురుమే దేవ దామోదర నమోస్తుతే" (అంటూ ఆచమనం చేయాలి)**
**సంకల్పం : దేశకాలౌ సంకీర్త్య గంగావాలుకాభి సప్తర్షి మండల పర్యంతం కృత వారాశేః పౌండరీకాశ్వమేధాది సమస్త క్రతు ఫలావాప్త్యర్థం, ఇహ జన్మని జన్మాంతరేచ బాల్య కౌమార యౌవన వార్ధకేషు జాగ్రత్ స్వప్న సుషుప్త్యవస్థాషు జ్ఞానతోఽజ్ఞానతశ్చ, కామతోఽకామతః, స్వతః ప్రేరణాయా సంభావితానాం సర్వేషాం పాపానా మపనోదనార్థం, ధర్మార్థకామ మోక్ష చతుర్విధ పురుషార్థ సిద్ధ్యర్థం, క్షేమస్థయిర్య విజయ అభయాయురారోగ్యై శ్వర్యాదినాం ఉత్తరోత్తరాభి వృద్ధ్యర్థం శ్రీ శివకేశవ అనుగ్రహ సిద్ధ్యర్థం కార్తీకమాసే..... వాసరే యుక్తాయాం తిధౌ......... శ్రీమాన్........ గోత్రాభిజాతం ......... నామధేయం పవిత్ర కార్తీక ప్రాతఃస్నానం కరిష్యే.**

**మంత్రం :**

**తులారాశింగతే సూర్యే గంగా త్రైలోక్యపావనీ |**

**సర్వత్ర ద్రవరూపేణ సా సంపూర్ణా భవేత్తదా ||**

**పై మంత్రం చదివి ప్రవాహానికి ఎదురుగానూ, వాలుగానూ, తీరానికి దగ్గరలో స్నానం ఆచరించి, కుడిచేతి బొటన వ్రేలితో నీటిని ఆచమనంచేసి, 3 దోసిళ్ల నీళ్లు గట్టుపై చల్లి తీరం చేరి, తడివస్త్రాలను నీరు కారేలా పిండాలి. దీనినే యక్షతర్పణం అంటారు. తరువాత మడి వస్త్రాలను, నామాలనూ ధరించి వారివారి కులాచారాల రీత్యా సంధ్యావందన గాయత్ర్యాదులను నెరవేర్చుకొని నదీతీరంలో గానీ, ఆలయానికి గానీ వెళ్లి**

శివకేశవులను అర్చించి, ఆవునేతితో దీపారాధనం చేసి, అనంతరం స్త్రీలు తులసి మొక్కనూ, దీపాన్ని - పురుషులు కాయలున్న ఉసిరికొమ్మనూ, దీపాన్ని బ్రాహ్మణులకు దక్షిణ తాంబూలంతో దానం చేయాలి.

**దానము చేయువారు చెప్పవలసిన మంత్రము :**

ఓం ఇదం, ఏతద్ ఓమితిచిత్తనిరోధస్స్యాత్ ఏతదితి కర్మణి ఇదమితి కృత్యమిత్యర్థాత్ అముకం ....... గోత్ర, .... నామధేయః దాతృ సర్వపాప అనౌచిత్య ప్రవర్తనాదిక సమస్త దుష్ఫలవినాశార్థం ఇదం అముకం దానం ఇదమితి దృష్ట్యాన అముకమితి వస్తు నిర్దేశాదిత్యాదయః పరిగృహ్ణామి లేదా స్వీగృహ్ణామి అని దానము ఈయవలెను.

**దానము తీసుకొనువారు చెప్పవలసిన మంత్రము :**

ఓం ఇదం, ఏతద్ ఓమితిచిత్తనిరోధస్స్యాత్ ఏతదితి కర్మణ్యే ఇదమితి కృత్యమిత్యర్థాత్ అముకం ....... గోత్ర, .... నామధేయః దాతృ సర్వపాప అనౌచిత్య ప్రవర్తనాదిక సమస్త దుష్ఫలవినాశార్థం ఇదం అముకం దానం ఇదమితి దృష్ట్యాన అముకమితి వస్తు నిర్దేశాదిత్యాదయః పరిగృహ్ణామి లేక స్వీగృహ్ణామి అని దానము తీసుకోవలెను.

**మొదటి రోజు చేయవలసిన పారాయణము :**

కార్తీక మహత్మ్యము గురించి జనకుడు వశిష్టుని అడుగుట : శ్రీ అఖిలాండకోటి బ్రహ్మాండము నందలి భరతఖండము నందు నైమిశారణ్యములో అన్ని పురాణములు, పుణ్య చరిత్రలు తెలిసిన గొప్ప మునిపుంగవుడు సూతమహాముని ఒకరోజు శౌనకాది మహామునులు తమకు గురుతుల్యుడైన సూతుని వద్దకు వచ్చి భక్తి శ్రద్ధలతో నమస్కరించి "అయ్యా! తమ వలన అనేక పురాణములు ఇతిహాసములు, సంగ్రహముగ తెలుసుకొన్నాము. ఇప్పుడు మాకు కార్తీకమాస మహాత్మ్యము గురించి తెలియజేయవలసినదిగా కోరుచున్నాము అని అడిగారు.

అప్పుడు సంతోషంతో సూతమహర్షి "ఓ మునిపుంగవులారా! మంచి విషయం అడిగారు. ఒకప్పుడు ఇదే కోరికను నారదుడు సృష్టికర్త అయిన బ్రహ్మను అడుగగా, బ్రహ్మదేవుడు నారదునికి విష్ణుమూర్తి లక్ష్మీదేవికి,

శివుడు పార్వతీదేవికి తెలియజేసిన ఆ కథను మీకు నేను తెలియచేయుదును. ఈ కథను వినుట వలన మానవులకు ధర్మార్ధములు కలుగుటయేకాక, ఇహమందును, పరమందును సకల ఐశ్వర్యములతో తులతూగుదురు. కావున శ్రద్ధగా వినవలసినది" అని ఈ విధంగా చెప్పనారంభించాడు.

పూర్వము ఒకరోజు పార్వతి పరమేశ్వరులు ఆకాశమార్గంలో విహరించుచుండగా పార్వతి దేవి "ప్రాణేశ్వరా! అన్ని ఐశ్వర్యములను కలుగచేయునట్టిది, మానవులందరూ వర్ణ భేదములు లేకుండా చేయతగినది, శాస్త్ర సమ్మతమైన వ్రతమును వివరింపు"మని కోరినది. అంతట పరమేశ్వరుడు చిరునవ్వుతో "దేవి! నీవు అడుగుచున్న వ్రతము స్కంద పురాణమున చెప్పబడిన దానిని ఇప్పుడు వశిష్ట మహాముని మిథిలా నగర రాజు అయిన జనక మహారాజునకు చెప్పబోవుచున్నాడు, చూడుము ఆ మిథిలా నగరమువైపు" అని మిథిలానగరపు దిశగా చూపించాడు.

ఆ మిథిలానగరములో వశిష్టుని రాకకు జనకుడు సంతోషించి అర్ఘ్య పాద్యములతో సత్కరించి, కాళ్లు కడిగి, ఆ జలమును తలపై చల్లుకొని "మహా మునివర్య! తమ రాకవల్ల నేనూ, నాశరీరము, నాదేశము, నాప్రజలు, పవిత్రులైనాము. మీయొక్క పాదధూళిచే నాదేహము పవిత్రమైనది. తమరు ఏ కార్యము కొరకు ఇక్కడకు వచ్చితిరో తెలియజేయండి!" అని వేడుకొన్నాడు.

అప్పుడు వశిష్ఠుడు "జనక మహారాజా! నేనొక మహాయజ్ఞము చేయతలపెట్టితిని, దానికి కావలసిన ధనం కోసం నిన్ను అడిగి యజ్ఞము ప్రారంభించాలని ఇచ్చటకు వచ్చాను" అని తెలుపగా జనకుడు "మునిచంద్రమా! ఆ యజ్ఞానికి కావలసిన ధనం తప్పక ఇవ్వగలను. కానీ, చాలాకాలము నుండి నాకొక సందేహము ఉన్నది. తమవంటి దైవజ్ఞులతో నా సందేహము తీర్చుకొనే అదృష్టము, అవకాశము ఈ విధంగా దొరికినది. గురురత్నా! సంవత్సరములో గల మాసములలో కార్తీకమాసమునకు ఎందుకు అంత పవిత్రత ఉన్నది? ఆ కార్తీకమాసము యొక్క గొప్పతనము ఏమిటి? అనే సందేహము నాకు చాలాకాలమునుండి ఉన్నది. కావున మీరు ఆ కార్తీక మాస మహత్యమును గురించి వివరించవలసినది" అని ప్రార్థించాడు.

వశిష్ట మహాముని చిరునవ్వుతో "రాజా! తప్పక నీ సందేహము తీర్చగలను. కార్తీకమాస వ్రతకథ మానవులందరు చేయతగినది. ఈ కార్తిక మాసము హరిహర స్వరూపము. ఈ మాసమునకు అధిపతి దామోదరుడు. ఈ కార్తీకమాస వ్రతముయొక్క ఫలము ఇంత అని చెప్పుటకు వీలుకాదు. ఈ కార్తీకమాస

వ్రతమును ఆచరించే వారితో పాటు వినిన వారికి కూడా ఎలాంటి నరక బాధలు లేక ఇహమందును, పరమందును సౌఖ్యమును పొందగలరు. నీవంటి రాజు ఈ కథను గురించి అడిగి తెలుసుకొనుట చాలా గొప్ప విషయము. శ్రద్ధగా వినవలసినది" అని ఈ విధంగా చెప్పసాగాడు.

"ఓ జనక మహారాజా! కార్తిక మాసములో, సూర్యభగవానుడు తులారాశియందు ఉండగా, వేకువజాముననే లేచి కాలకృత్యములు తీర్చుకొని, స్నానము చేసి, దాన ధర్మములను, దేవతారాధన చేసినచో - దాని వలన చెప్పలేనంత పుణ్యఫలము లభించును. ముందుగా కార్తీక మాసమునకు అధిదేవత అయిన దామోదరునికి నమస్కరించి "ఓ దామోదరా! నేను చేయు కార్తీక వ్రతమునకు ఎట్టి ఆటంకములు లేకుండా నన్ను కాపాడుము" అని ప్రార్థించి వ్రతమును ప్రారంభించాలి.

## కార్తీక స్నాన విధానము :

ఓ రాజా! ఈ వ్రతము చేయతలపెట్టిన రోజు నుండి సూర్యోదయమునకు ముందే లేచి, కాలకృత్యములు తీర్చుకొని, నదికి వెళ్ళి స్నానము చేసి గంగాదేవికి, శ్రీమన్నారాయణునకు, పరమేశ్వరునకు, భైరవునకు నమస్కరించి, సంకల్పము చెప్పుకొని, మరల నీటి యందు మునిగి సూర్య భగవానునకు అర్ఘ్యము ఇచ్చి, పితృదేవతలకు తర్పణములు వదలి, గట్టుపై మూడు దోసిళ్ళు నీళ్లు పోయవలెను. ఈ కార్తీక మాసములో పుణ్య నదులైన అన్ని నదులలో గంగాదేవి నివాసముంటుంది. ఏ నదిలో స్నానము చేసినా గొప్పఫలము లభిస్తుంది. స్నానము చేసిన తరువాత తడిబట్టలు వదలి, మడిబట్టలు కట్టుకొని శ్రీమహావిష్ణువుకు ఇష్టమైన పువ్వులను తానే స్వయముగా కోసి తెచ్చి నిత్యధూప, దీప, నైవేదములతో భగవంతుని పూజ చేసుకొని, గంధము తీసి భగవంతునికి సమర్పించి తానుకూడా బొట్టు పెట్టుకోవాలి. తరువాత అతిథులను పూజించి వారికి ప్రసాదము పెట్టి, తన ఇంటి వద్దగానీ, దేవాలయములోగాని, లేక రావిచెట్టు మొదలులోకానీ కూర్చొని, కార్తిక పురాణము చదవాలి. ఆ సాయంకాలము సంధ్యావందనము చేసి, శివాలయంలోగానీ, విష్ణు ఆలయంలోగానీ లేక తులసికోట వద్ద గాని, దీపారాధన చేసి శక్తి కొలది నైవేద్యము స్వామికి సమర్పించి అందరికి పంచిపెట్టి తర్వాత తాను తినవలెను. ఈ విధముగా వ్రతమును చేసిన స్త్రీ పురుషులు ఇద్దరికీ పూర్వజన్మలో, ప్రస్తుత జన్మలో కూడా చేసిన పాపములు తొలగిపోయి మోక్షము పొందుదురు. ఈ వ్రతము

చేయుటకు అవకాశము లేనివారు వ్రతము చేసిన వారిని చూచి, వారికి నమస్కరించిన వారికి కూడా కార్తీకమాస వ్రత ఫలముదక్కును.

స్కాంద పురాణాంతర్గత వశిష్టప్రోక్త కార్తిక మహత్మ్యమందలి మొదటి అధ్యాయము - మొదటి రోజు పారాయణము సమాప్తం.

## కార్తీక పురాణము 2వ అధ్యాయము

**కార్తీకమాసంలో రెండవ రోజు చేయవలసిన విధులు :**

2వ రోజు శుద్ధ విదియ సోదరి ఇంటికి వెళ్ళి ఆమె చేతి భోజనం చేసి ఆమెకు కానుకలు ఇవ్వవలెను. తోబుట్టువు లేకున్న వరుసకు సోదరి అయిన వారి ఇంటికి వెళ్ళవలెను. కోసిన వస్తువులు తినకూడదు. తామరపువ్వులు, ఉప్పు నూనె ఈ రోజు దానము ఇవ్వవలెను.

**రెండవ రోజు చేయవలసిన పారాయణము :**

### కార్తీక సోమవార వ్రత మహిమ :

శ్లో|| ఓమిత్యేకాక్షరం బ్రహ్మవ్యాహరంతీ త్రయశ్శిఖాః |

తస్మై తారాత్మనే మేధా దక్షిణామూర్తయే నమః ||

ఓ జనక మహారాజా! ఇంతవరకు నీకు కార్తీక మాసము నందు ఆచరించవలసిన విధి విధానము మాత్రమే చెప్పితిని. కార్తీక మాసములో సోమవార వ్రతమునకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉన్నది. కావున, సోమవార వ్రత విధానము, దాని మహిమ గురించి వివరించెదను. జాగ్రత్తగా వినుము. కార్తిక మాసములో సోమవారము శివునకు చాలా ఇష్టమైన రోజు. ఆ రోజున స్త్రీగాని, పురుషుడుగాని ఏజాతివారైనా రోజంతా ఉపవాసం ఉండి, నదిలో స్నానము చేసి తమ శక్తి కొలది దానధర్మములు చేసి నిష్టతో శివునకు బిల్వ పత్రములతో అభిషేకము చేసి, సాయంత్రము నక్షత్రములను చూసిన తరువాత

భోజనము చేయవలెను. ఈ విధముగా నిష్టతో ఉండి ఆ రాత్రి అంతా జాగరణ చేసి పురాణమును చదివి తెల్లవారిన తరువాత నదికి వెళ్లి స్నానము చేసి, నువ్వులను దానము చేసి, తమశక్తి కొలది పేదలకు అన్నదానము కూడా చేయవలెను. ఈ విధంగా చేయలేనివారు కనీసము ముగ్గురు బ్రాహ్మణులకైనా తృప్తిగా భోజనము పెట్టి, తాము కూడా భోజనము చేయవలెను. ఉపవాసము ఉండగలిగిన వారు సోమవారము నాడు రెండుపూటలా భోజనముగాని ఏవిధమైన ఫలహారములు కానీ తినకుండా కార్తీక మాసమునందు వచ్చు సోమవార వ్రతమును చేసినచో పరమేశ్వరుడు కైలాస ప్రాప్తి కలిగించి శివసన్నిధికి చేర్చుకొనును. భర్తలేని వితంతువు సోమవార వ్రతమును చేసి, శివ పూజ చేసినచో కైలాస ప్రాప్తియు, విష్ణు పూజ చేసినచో వైకుంఠ ప్రాప్తియు పొందుదురు. దీనికి ఉదాహరణముగ ఒక కథ నీకు చెప్పెదను. శ్రద్ధగా విను.

## కార్తీక సోమవార ఫలముచే కుక్క కైలాసముకు చేరుట :

పూర్వకాలమున కాశ్మీర దేశములో ఒక బ్రాహ్మణుడు కలడు. అతడు పురోహిత వృత్తితో తన కుటుంబమును పోషించుకుంటూ ఉండెను. అతనికి "నిష్టురి" అనే కుమార్తె కలదు. తండ్రి ఆమెను సౌరాష్ట్ర దేశమునకు చెందిన మిత్రశర్మ అను ఒక బ్రాహ్మణ యువకునికి ఇచ్చి పెండ్లి చేసాడు. ఆ బ్రాహ్మణ యువకుడు నాలుగు వేదములు, శాస్త్రములు చదివిన వాడు కావటం వలన సదాచార పరాయణుడై భూతదయ గల్గినవాడు, ఎప్పుడూ నిజమునే చెప్పేవాడు, నిరంతరం భగవంతుని పేరు జపించుచుండుటచే అతనిని "అపరబ్రహ్మ" అని కూడ పిలిచెడివారు. ఇటువంటి ఉత్తమ పురుషుని భార్య అయిన నిష్ఠురి యౌవన గర్వముతో కన్నుమిన్ను తెలియక పెద్దలను తిడుతూ, అత్తమామలను, భర్తను దూషిస్తూ, కొట్టుచు, పరపురుషులతో కూడినదై, వ్యభిచారిగా మారి తన ప్రియులు తెచ్చిన తినుబండారములు, వస్త్రములు పువ్వులు, ధరిస్తూ, దుష్టురాలై తిరుగుచుండగా, వంశమునకు అప్రతిష్ట తెచ్చుచున్నదని అత్తమామలు ఆమెను తమ ఇంటి నుండి వెడలగొట్టారు. కానీ, శాంత స్వభావుడగు భర్త మాత్రం ఆమె ఎంతటి తప్పుడు పనులు చేసినను సహించి, గృహస్థాశ్రమ ధర్మానికి లోపం వస్తుందని పొమ్మనకుండా ఆమెతోనే కాపురము చేస్తుండేవాడు. కానీ, చుట్టుప్రక్కల వారు ఆమె గయ్యాళితనమును ఏవగించుకొని ఆమెను "కర్కశ" అని పిలిచేవారు.

ఈవిధంగా కొంతకాలము జరిగిన తరువాత - ఆ కర్కశ, ఒకనాటి రాత్రి తన భర్త గాఢనిద్రలో ఉన్న సమయము చూచి, మెల్లగా లేచి, తాళి కట్టిన భర్త అని కూడా చూడకుండా, దయాదాక్షిణ్యాలు లేకుండా ఒక బండ రాతిని తెచ్చి అతని తలపై గట్టిగా కొట్టినది. వెంటనే అతడు చనిపోయాడు. ఆ మృత దేహమును ఎవరి సహాయము లేకుండానే రహస్యంగా దొడ్డి దారిలో తీసుకొనిపోయి ఊరి చివర ఉన్న పాడుబడిన బావిలో పడేసి ఏమీ తెలియని దానివలె ఇంటికి వచ్చినది . ఇక తనకు ఏ ఆటంకములు లేవని విచ్చల విడిగా తిరుగుచు, తన సౌందర్యం చూపి ఎందరినో వశపరచుకొని, అనేక జాతి పురుషులతో తిరిగి వర్ణసంకరురాలు అయినది. అంతేకాక పడుచు కన్యలను, భర్తలతో కాపురము చేయుచున్న స్త్రీలను తన మాయ మాటలతో చేరదీసి, వారికి ఆశలు కల్పించి, విటులకు తార్చి ధనమును సంపాదించసాగినది.

ఓ జనక మహారాజా! యౌవన బింకము ఎంతో కాలము ఉండదు గదా! క్రమక్రముగా ఆమెలోని యౌవనము నశించినది. దానికి తోడు శరీరమంతా కుష్టు వ్యాధితో కురూపియై భయంకర రోగములతో బాధపడుచున్నది. కర్కశ ఈ విధంగా నరక బాధలు అనుభవించి, ఒకనాడు దిక్కులేని చావు చచ్చినది. బ్రతికినంత కాలం ఒక్కరోజైనా పురాణ శ్రవణం చేయని ఆలయానికైనా వెళ్ళని పాపిష్టురాలు గదా! చనిపోయిన వెంటనే భయంకరులైన యమభటులు ఆమెను తీసుకొనిపోయి యమధర్మరాజు ముందు ఉంచారు. చిత్రగుప్తుడు ఆమె పాపాల జాబితాను చెప్పగా, యమధర్మరాజు ఉగ్రుడై, భరించరాని శిక్షలు విధించాడు. విటులతో సుఖించినందుకు గాను యమభటులు ఆమెను ఎర్రగా కాల్చిన ఇనుప స్తంభమునూ కౌగలించుకోమని చెప్పిరి. భర్తను బండరాతితో కొట్టి చంపినందుకు ఇనుప గదలతో కొట్టిరి. పతివ్రతలను వ్యభిచారిణిలుగా చేసినందుకు సలసల కాగిన నూనెలో పడవేసిరి. తల్లితండ్రులకు, అత్తమామలకు అపకీర్తి తెచ్చినందుకు సీసము కరిగించి నోటిలోను, చెవిలోను పోసి, ఇనుపకడ్డీలు కాల్చి వాతలు పెట్టారు. చివరకు కుంభీపాకమను నరకములో వేయగా, అందులో ఇనుప ముక్కులుగల కాకులు, విషసర్పాలు, తేళ్ళు, జెర్రెలు కసితో కుట్టినవి. ఆమె చేసిన పాపములకు ఇటు ఏడు తరాలవాళ్లు అటు ఏడు తరాలవాళ్లు నరకబాధలు అనుభవించుచుండిరి.

ఈ ప్రకారముగా నరక బాధలను అనుభవించి, చివరకు పదిహేనవ జన్మలో కుక్కగా జన్మించి, ఆకలిబాధ పడలేక ఇల్లిల్లు తిరుగుచుండగా, కర్రలతో కొట్టువారు కొట్టగా, తిట్టువారు తిట్టుచుండగా, కాలం

గడుపుచున్నది. ఇట్లుండగా ఒకనాడు కార్తీకమాసంలో బ్రాహ్మణుడు కార్తీక సోమవార వ్రతమును చేసి ఉపవాసముండి, సాయంత్రము నక్షత్రములను చూచి, బలి అన్నము అరుగుపై పెట్టి, కాళ్లు చేతులు కడుగుకొనుటకై లోనికి వెళ్ళిన సమయములో ఈ కుక్క వచ్చి ఆ బలి అన్నము తిన్నది. వ్రతనిష్టాగరిష్టుడైన ఆ బ్రాహ్మణుని పూజా విధానముచే జరిపించిన బలి అన్నము తినుట చేత, ఆ రోజు కార్తీక సోమవారమగుట వలన, కుక్క ఆ రోజంతా ఉపవాసముతో వుండుట వలన, శివ పూజ పవిత్ర స్థానమైన ఆ యింట దొరికిన ప్రసాదము తినుట వలన, ఆ కుక్కకు జన్మాంతర జ్ఞానము కలిగి, వెంటనే ఆ శునకము "బ్రాహ్మణోత్తమా! నన్ను కాపాడుము" అని మొరపెట్టుకొన్నది. ఆ మాటలు విన్న బ్రాహ్మణుడు బైటకు వచ్చి ఆశ్చర్యంతో "ఎవరు నీవు! నీ వృత్తాంతము ఏమిటి!" అని ప్రశ్నించాడు. అంత ఆ కుక్క "మహానుభావ! ఈనా పుట్టుకకు ముందు పదిహేను జన్మల క్రితం నేను బ్రాహ్మణ కన్యను. వ్యభిచారిణినై అగ్నిసాక్షిగ పెండ్లాడిన భర్తను చంపి, వృద్ధాప్యములో కుష్ఠురాలనై దేహము చాలించి, యమదూతలవల్ల మహానరకములు అనుభవించి నా పూర్వీకుల పుణ్యఫలము వల్ల ఈ జన్మలో కుక్కగా జన్మించాను. ఈ రోజు మీరు కార్తీక సోమవార వ్రతము చేసి ఇచ్చట ఉంచిన బలి అన్నము తినుట వలన నాకు జ్ఞానోదయము కలిగినది. కావున ఓ విప్రోత్తమా! నాకు మహోపకారంగా, మీరు చేసిన కార్తీక సోమవార వ్రతఫలమొకటి ఇచ్చి నాకు మోక్షము కలిగించమని ప్రార్థించుచున్నాను" అని దీనంగా వేడుకొన్నది. ఆ బ్రాహ్మణుడు కనికరించి తాను కార్తీక సోమవార వ్రతం వల్ల సంపాదించిన ఒకనాటి ఫలమును ఆమెకు ధారపోయగా వెంటనే ఆ శునకం అందమైన స్త్రీ రూపం దాల్చినది. పుష్పక విమానము వచ్చి అక్కడి వారందరూ చూస్తుండగానే ఆ విమాన మెక్కి శివ సాన్నిధ్యముకు వెళ్ళినది.

జనక మహారాజా! కార్తీక సోమవార వ్రత మహాత్మ్యము యిది. కనుక నీవు నీ దేశ ప్రజలు కార్తీక సోమవారవ్రతం చేసి శివ సాన్నిధ్యమును పొందుమని వశిష్ఠుడు హితబోధ చేశాడు.

స్కాంద పురాణాంతర్గత, వశిష్ట ప్రోక్త కార్తీక మహాత్మ్యమందలి రెండవ అధ్యాయము-రెండవ రోజు పారాయణము పూర్తి అయినది.

# కార్తీక పురాణము 3వ అధ్యాయము

## కార్తీకమాసంలో మూడవ రోజు చేయవలసిన విధులు :

3వ రోజు శుద్ధ తదియ త్రిలోచన గౌరీ వ్రతము చేయవలెను. వ్రతం చేయలేనివారు పార్వతీదేవికి కుంకుమ అర్చన చేయుట మంచిది. పులుపు పదార్థములను తినరాదు. ఈ రోజు ఉప్పును దానం ఇవ్వాలి.

## మూడవ రోజు చేయవలసిన పారాయణము :

కార్తీకమాస స్నాన మహిమ ఓ జనక మహారాజా! కార్తీక మాసములో చేసే స్నానదానముల వలన విశేష పుణ్యం లభిస్తుంది. సకల ఐశ్వర్యములు కలుగుటేకాక మరణము తరువాత శివ సాన్నిధ్యమును చేరుదురు. కానీ, కొంతమంది భోగభాగ్యములు విడువలేక, కార్తీకస్నానము చేయక, అవినీతిపరులై, భ్రష్టులై తిరిగి అనేక జన్మలు చండాలురై పుట్టి, చివరకు క్షుద్ర జన్మలు అనగా కోడి, కుక్క పిల్లి మరియు బ్రహ్మరాక్షసలుగా పుడతారు దీనిని గురించి ఒక ప్రాచీన కథ చెప్పెదను శ్రద్ధగా వినుము అని ఈ విధంగా చెప్పాడు.

## బ్రహ్మ రాక్షసులకు ముక్తి కలుగుట :

ఆంధ్రదేశము నందలి దక్షిణ ప్రాంతమున ఒక గ్రామములో మహా విద్వాంసుడు, తపఃశాలి, జ్ఞానశాలి, సత్యవ్యాక్య పరిపాలకుడు భూతదయ, పరోపకార బుద్ధి అగు "తత్వనిష్టుడు" అనే బ్రాహ్మణుడు ఒకడు ఉన్నాడు. ఒకనాడు ఆ బ్రాహ్మణుడు తీర్థయాత్రలు చేయవలెనని కోరికతో బయలుదేరి చివరకు గోదావరి తీరానికి చేరుకున్నాడు. ఆ తీర్ధ సమీపమున ఒక మర్రిచెట్టు ఉన్నది. ఆ చెట్టుపైన భయంకర ముఖములతో, పొడుగాటి జుట్టుతో, నల్లని తాటిచెట్టులాగా, బాన పొట్టలతోను చూచువారికి అతి భయంకరంగా ఉన్న ముగ్గురు బ్రహ్మరాక్షసులు నివసిస్తూ, ఆ దారిన వెళ్ళే బాటసారులను పట్టి భక్షించుచూ ఆ ప్రాంతమంతయు భయకంపింతంగా చేసేవారు. తీర్థయాత్రకై బయలుదేరి గోదావరి పుణ్యక్షేత్రమునకు వస్తున్న విప్రుడు ఆ వృక్షము వద్దకు రాగా బ్రహ్మ రాక్షసులు క్రిందకు దిగి అతనిని చంపబోవు సమయమున, బ్రాహ్మణుడు ఆ భయంకర రూపములను చూచి గజగజ వణుకుచూ ఏమియు తోచక నారాయణ స్తోత్రం పెద్దగా పఠిస్తూ

"ప్రభో! ఆర్తత్రాణపరాయణ! అనాధరక్షకా! ఆపదలో ఉన్న గజేంద్రుని, మహాసాధ్వి ద్రౌపదిని, బాలుడగు ప్రహ్లాదుని రక్షించిన విధంగానే - ఈ పిశాచముల బారినుండి నన్ను రక్షించు తండ్రీ!" అని వేడుకొనగా, ఆ మాటలు విన్న బ్రహ్మరాక్షసులకు జ్ఞానోదయం కలిగి "మహానుభావా! మీ నోటినుండి వచ్చిన శ్రీమన్నారాయణ స్తుతి విని మాకు జ్ఞానోదయం కలిగినది. మీ రాక వల్ల మేము ధన్యులమయ్యాము. మమ్ము రక్షింపు"మని ప్రాధేయపడ్డారు. వారి మాటలు విన్న విప్రుడు ధైర్యం తెచ్చుకొని "ఎవరయ్యా! మీరు ? మీకు ఈ రాక్షస రూపం ఎందువలన కలిగినది? మీ పూర్వజన్మ చరిత్ర ఏమిటి ?" అని అడిగాడు. "విప్రోత్తమా! మీ దర్శన భాగ్యం వలన మాకు పూర్వ జన్మమందలి కొంత జ్ఞానము కలిగినది. అందులో ఒక రాక్షసుడు తన వృత్తాంతము ఇలా చెప్పాడు.

"ఓ బ్రాహ్మణోత్తమా! నేను ద్రావిడ దేశ బ్రహ్మణుడను. నేను మహా పండితుడనని గర్వముతో, న్యాయాన్యాయ విచక్షణ మాని పశువువలె ప్రవర్తించితిని, బాటసారుల వద్ద, అమాయకపు గ్రామస్థుల వద్ద దౌర్జన్యంగా ధనాన్ని వసూలుచేసి దుర్వ్యసనాలతో భార్యాబిడ్డలను సుఖపెట్టక, పండితులను అవమానపరుస్తూ దానధర్మాలు చేయక, ఏనాడైనా ఒక బ్రాహ్మణునికి పిడికెడన్నం పెట్టక పాపాలను మూటగట్టుకున్నాను. ఆ విధంగా నేను చనిపోయిన తరువాత బ్రాహ్మణ ధనం అపహరించిన పాపానికి రౌరవాది నరకాలు అనుభవించి తరువాత భూలోకంలో చాలా నీచజన్మలెత్తి చివరకు బ్రహ్మరాక్షసునిగా పుట్టాను. ఆనాటి నుండి నేను ఈ రాక్షస రూపముతో నరభక్షణము చేయుచున్నాను. కావున, ఓ విప్రోత్తమా! నన్ను ఈ రాక్షసరూపం నుండి రక్షించవలసినదిగా మొదటి రాక్షసుడు తన వృత్తాంతము చెప్పి వేడుకొన్నాడు.

ఇక రెండవ రాక్షసుడు "ఓ బ్రాహ్మణోత్తమా! నేను కూడా పూర్వజన్మలో బ్రహ్మణుడనే. నేనూ నీచుల సహవాసముచేసి తల్లితండ్రులను బాధించి వారికీ తిండి పెట్టక మాడ్చి వారి ఎదుటనే నా భార్యాబిడ్డలతో పంచభక్ష్య పరమాన్నములతో భుజించాను. నేను ఎట్టి దానధర్మములు చేయక, నా బంధువులను కూడా హింసించి వారి ధనము అపహరించి రాక్షసునివలె ప్రవర్తించాను. నేను మరణించిన తరువాత నరక కూపంతో నానా యాతనలు పడి భూలోకంలో ఈ బ్రహ్మరాక్షసిగా జన్మించాను. నన్ను ఈ పాపపంకిలము నుండి రక్షింపుము" అని బ్రాహ్మణుని పాదములపై బడి వేడుకొన్నాడు.

మూడవ రాక్షసుడు కూడా తన వృత్తాంతమును ఈ విధంగా చెప్పాడు. "మహాశయా! నేనొక సంపన్న కుటుంబములో పుట్టిన బ్రహ్మణుడను. నేను విష్ణు ఆలయములో అర్చకునిగా ఉన్నాను. స్నానసంధ్యలు విడిచిపెట్టి, కర్మచండాలుడినై భగవంతునికి ధూపదీప నైవేద్యములైనను అర్పించక, భక్తులు తెచ్చిన సంభారములను నా ఉంపుడుగత్తెకు యిచ్చేవాడిని. మద్యమును, మాంసము తినుచు, పాపకార్యములు ఎన్నోచేసాను. నా మరణము తరువాత నరకబాధలు అనుభవించి, ఎన్నో జన్మలెత్తి చివరికి ఈ రాక్షస జన్మతో ఈ చెట్టు నాశ్రయించి ఉంటున్నాను. ఓ విప్రోత్తమా! నన్ను కూడా పాపవిముక్తుని చేయుము" అని ప్రార్థించాడు.

"ఓ జనక మహారాజా! తపోనిష్టుడగు ఆ బ్రాహ్మణుడు మూడు పిశాచముల ప్రార్థనలను ఆలకించి వారితో "ఓ బ్రహ్మ రాక్షసులరా! భయపడకండి. మీకు విముక్తిని కలిగించెదను" అని, వారిని ఓదార్చి తనతో తీసుకొనిపోయి ఆ ముగ్గురిని విముక్తి సంకల్పము చెప్పుకొని తానే స్వయముగా గోదావరిలో స్నానము చేసి వారి చేత చేయించి, స్నాన పుణ్యఫలమును ముగ్గురు బ్రహ్మ రాక్షసులకు ధారపోయగా వారి రాక్షస రూపములు పోయి దివ్యరూపములు ధరించి వైకుంఠమునకు వెళ్ళారు. జనక మహారాజా! కార్తీక మాసములో నదీ స్నానము చేసిన ఫలితం ఎంత గొప్పదో! కనుక కార్తీకమాస స్నానఫలం వలన హరిహరాదులు సంతృప్తి పొంది, సకల ఐశ్వర్యములు కలుగజేస్తారు. కనుక స్త్రీ పురుషులందరూ కూడా కార్తీకమాసంలో పుణ్యనదీస్నానం తప్పకచేయాలి.

స్కాందపురాణాంతర్గత, వశిష్టప్రోక్త కార్తీక మహాత్మ్యమునందలి మూడవ అధ్యాయము-మూడవ రోజు పారాయణము పూర్తి అయినది.

## కార్తీక పురాణము 4వ అధ్యాయము

### కార్తీకమాసంలో నాల్గవ రోజు చేయవలసిన విధులు :

4వ రోజు శుద్ధ చవితి పుట్టవద్దకు వెళ్ళి సుబ్రహ్మణ్యస్వామివారిని ఆరాధించాలి లేదా దేవాలయంలో పూజ చేయాలి. వంకాయ, ఉసిరికాయ తినకూడదు. ఈ రోజు పెసరపప్పు, నువ్వుల నూనె దానం ఇవ్వాలి.

## నాల్గవ రోజు చేయవలసిన పారాయణము :

### పారాధన మహిమ :

జనక మహారాజు మహర్షి మాటలు విని మహదానందంతో "మహాతపస్వీ! తమరు తెలియజేయు ఇతిహాసములు విన్న కొలది తనివి తీరటం లేదు. కార్తీకమాసములో ముఖ్యముగా ఏమేమి చేయవలయునో, ఎవరిని పూజించవలెనో నాకు తెలియజేయండి" అని అడుగగా వశిష్ఠుల వారు ఇట్లు చెప్పనారంభించారు.

"జనక మహారాజా! కార్తీక మాసమందు సర్వసత్కార్యములనూ చేయవచ్చును. దీపారాధన అతి ముఖ్యము. శివకేశవుల ప్రీతి కొరకు శివాలయమునకానీ, విష్ణు ఆలయము నందుగానీ దీపారాధన చేయవచ్చును. సూర్యాస్తమయములో శివకేశవుల సన్నిధిలో ఆవునేతితోగానీ, కొబ్బరినూనెతోగానీ, విప్పనూనెతోగానీ, అముదముతోగానీ దీపారాధన చేయవచ్చు. దీపారాధన ఏ నూనెతో చేసిననూ మిగుల పుణ్యాత్ములుగాను, భక్తిపరులగాను, అష్ట ఐశ్వర్యములూ కలిగి శివసన్నిధికి వెళ్ళెదరు. ఇందుకు ఉదాహరణగా ఒక కథ చెప్తాను వినండి" అని ఈ విధంగా చెప్పసాగాడు.

కార్తీక దీప మహిమ పూర్వము పాంచాలదేశము పాలించే రాజుకు పిల్లలు లేక అనేక యజ్ఞయాగాదులు చేసినా అతడు సంతానవంతుడు కాలేదు. సంతానం లేదనే బాధ అతడిని వెంటాడుతుంది. ఒకనాడు ఆ రాజు వద్దకు పిప్పలాదుడు అనే మునిపుంగవుడు వచ్చి "పాంచాల రాజా! నీవు ఎందుకు విచారిస్తున్నావు ? అని అడుగగా, "ఋషి పుంగవా! నాకు అష్ట ఐశ్వర్యములు, రాజ్యము, సంపదా అన్ని ఉన్నాయి. నా వంశము నిల్పుటకు పుత్రసంతానము లేక, కృంగి కృశించి పోవుచున్నాను" అని చెప్పాడు. అప్పుడు మునిపుంగవుడు "ఓ రాజా! కార్తీకమాసమున శివసన్నిధిని శివదేవుని ప్రీతి కొరకు దీపారాధనము చేసినచో నీ కోరిక నెరవేరగలదు" అని చెప్పి అతడు వెళ్ళిపోయాడు.

వెంటనే పాంచాలరాజు అది కార్తీకమాసం కావడంతో పుత్రప్రాప్తికై అతి భక్తితో తన రాజ్యంలోని శివాలయములలో కార్తీకమాసము నెలరోజులూ దీపారాధన చేసే విధంగా చాటింపు వేయించి, తాను కూడా కార్తీకమాస దీక్ష వహించి, నియమానుసారముగా వ్రతము చేసి దానధర్మాలతో ప్రసాదములను ప్రజలకు పంచిపెడుతూ, నెలరోజులూ భక్తిశ్రద్ధలతో దీపారాధనలు చేశాడు. ఆ పుణ్యకార్యమువలన ఆ రాజు భార్య

గర్భవతియై నవమాసములు నిండిన తరువాత ఒక శుభముహూర్తమున ఒక కుమారుని కన్నది. రాజదంపతులు ఎంతో సంతోషించి తన దేశమంతట పుత్రోత్స వములు చేయించి, బ్రాహ్మణులకు దానధర్మాలు చేసి, ఆ బాలునికి "శత్రుజిత్తు" అని నామకరణము చేసి, అల్లారుముద్దుగా పెంచుచుండిరి. రాకుమారుడు శత్రుజిత్తు దినదిన ప్రవర్థమానుడై అన్ని శాస్త్రములు, ధనుర్విద్య, కత్తిసాము మొదలైన అన్ని విద్యలు నేర్చుకొనెను. కాని, యౌవన దశలో దుష్టుల సహవాసము చేతను, తల్లితండ్రుల గారాబము చేతను తన కంటికి నచ్చిన స్త్రీలను బలాత్కరిస్తూ, ఎదిరించిన వారిని దండిస్తూ, తన కామవాంఛలు యథేచ్ఛగా తీర్చుకొనుచుండెను.

తల్లితండ్రులు కూడా, తమకు లేక లేక కలిగిన కుమారుని ఎడల చూచీ చూడనట్లు వినీ విననట్లు ఉన్నారు. శతృజిత్తు ఆరాజ్యములో తన కార్యములకు అడ్డు చెప్పేవారిని చంపుతానని, కత్తి పట్టుకుని ప్రజలను భయపెట్టుచుండెను. ఆవిధంగా తిరుగుచుండగా ఒకనాడు ఒక అందమైన బ్రాహ్మణ కన్యను చూచుట జరిగినది. ఆమె ఒక ఉత్తమ బ్రాహ్మణుని భార్య, ఎంతో రూపవతి. అట్టి స్త్రీ కంటపడగానే రాజకుమారుని మనస్సు కామవికారముతో ఆమెను సమీపించి తన కామవాంఛ తెలియచేయగా, ఆమె కూడా అతని సౌందర్యానికి ముగ్ధురాలై కులము, శీలము, సిగ్గు విడిచి అతని చెయ్యి పట్టుకొని తన శయన మందిరానికి తీసుకొనిపోయినది. ఈ విధంగా వారు ప్రతిరోజు అర్ధరాత్రి వేళ ఒక అజ్ఞాతస్థలములో కలుసుకొనుచు తమ కామవాంఛ తీర్చుకొనుచుండిరి. ఇట్లు కొంతకాలం జరిగినది. కొంతకాలానికి ఈ సంగతి ఆమె భర్తకు తెలిసి, పసిగట్టి, భార్యనూ, రాజకుమారునీ ఒకేసారి చంపవలెనని నిశ్చయించుకొని ఒక ఖడ్గమును సంపాదించి సమయము కొరకు వేచి ఉన్నాడు.

ఒక రోజున ఆ ప్రేమికులిద్దరూ ఒక శివాలయమున కలుసుకొనవలెనని నిర్ణయించుకొని, ఎవరికి వారు విడివిడిగా అచటికి బయలుదేరారు. ఈ సంగతి పసిగట్టిన ఆమె భర్త అంతకుముందే కత్తితో సహా బయలుదేరి గర్భగుడిలో దాగి ఉన్నాడు. అ కాముకులు ఇద్దరును గుడిలోకి రాగా ఆ గది మొత్తము "చీకటిగా ఉన్నది, దీపము ఉంటే బాగుండును కదా", అని రాకుమారుడు అనగా, ఆమె తన పైటచెంగును చించి అక్కడ ఉన్న ఆముదపు ప్రమిదలో ముంచి దీపమును వెలిగించినది. అదే అదనుగా ఆమె భర్త, తనతో తెచ్చుకున్న కత్తితో ఒక్క వేటుతో తన భార్యనూ, రాజకుమారుని ఖండించి తానుకూడా పొడుచుకుని శివలింగం ముందుపడి మరణించాడు. వారి పుణ్యం కొద్దీ ఆ రోజు కార్తికశుద్ధ పౌర్ణమి, సోమవారము అగుటవలన, వారిని తీసుకొని

పోవుటకు శివదూతలు, యమదూతలు వచ్చారు. యమభటులు బ్రహ్మణుని ఈడ్చుకొని తీసుకుపోతున్నారు. శివదూతలు ప్రేమికులు ఇద్దరిని విమానం ఎక్కించి కైలాసానికి తీసుకొనిపోబోతున్న వారితో బ్రాహ్మణుడు "ఓ శివదూతలారా! కామాంధకారముతో కన్నుమిన్ను తెలియక పశువులుగా వ్యవహరించిన అ వ్యభిచారులను విమానములో కైలాసము తీసుకొని పోవుట చాలా విచిత్రముగా ఉన్నది అన్నాడు.

అంతట యమ కింకరులు "ఓ బ్రాహ్మణోత్తమా! వారు ఎంతటి నీచులైనా, ఈ పవిత్ర దినమున, అనగా, కార్తికపౌర్ణమీ సోమవారము రోజున తెలిసో తెలియకో శివాలయములో శివుని సన్నిధిలో దీపం వెలిగించుట వలన అప్పటి వరకూ వారు చేసిన పాపములన్నియు నశించిపోయినవి. కనుక వారిని కైలాసమునకు తీసుకొనిపోవుచున్నాము. నీవు ఈ కార్తీక సోమవారం రోజున దీపారాధన చేయలేదు కనుక నీకు నరకం ప్రాప్తించినది. ఈ మాటలు విన్న రాజకుమారుడు పశ్చాత్తాపంతో "అలా ఎన్నటికిని జరుగనివ్వను. తప్పులు చేసిన మాకు మోక్షమూ సన్మార్గుడైన బ్రాహ్మణునకు నరకమా! తప్పొప్పులు ఏ విధంగా ఉన్నప్పటికి మేము ముగ్గురము ఒకే సమయములో ఒకే స్థలములో మరణించాము. కనుక ఆ ఫలము మా అందరికి వర్తించవలసినదే" అని, తాము చేసిన దీపారాధన ఫలములో కొంత ఆ బ్రాహ్మణునకు దానము చేశాడు. వెంటనే అతనిని కూడా పుష్పక విమాన మెక్కించి కైలాసానికి తీసుకుపోయారు.

జనక మహారాజా! వింటివి కదా! శివాలయములో దీపారాధన చేయుట వలన ఆ ప్రేమికులు చేసిన పాపములు పోవుటయేగాక, కైలాసప్రాప్తి కూడా కలిగినది. కావున, కార్తీక మాసములో శివాలయమున దీపము వెలిగించిన వారికి మరుజన్మ ఉండదు.

స్కాంద పురాణాంతర్గత వశిష్ఠప్రోక్త కార్తీక మహాత్మ్యమందలి నాలుగో అధ్యయము - నాల్గవ రోజు పారాయణము పూర్తి అయినది.